చిలకలగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శశాంక్‌రెడ్డి

ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్, మే 22: ఈస్ట్ జోన్ పరిధిలోని చిలకలగూడ డివిజన్ ఏసీపీగా కె.శశాంక్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1995వ బ్యాచ్‌కు చెందిన శశాంక్‌రెడ్డి నగరంలో మారేడుపల్లి ఎస్‌హెచ్ఓ, పంజాగుట్ట డీఐతో, ఎల్లారెడ్డితో పాటు సైబరాబాద్ సీసీఎస్‌లో పని చేసి బదిలీపై చిలకలగూడ డివిజన్ ఏసీపీ కార్యాలయానికి వచ్చారు. ఏసీపీ కార్యాలయంలో లాలాగూడ, చిలకలగూడ, వారాసిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో సమావేశాన్ని నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ జైపాల్‌రెడ్డి డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడుతానని, ముఖ్యమైన కూడళ్లలో బందోబస్తును పెంచుతామని, కాలనీలు, అపార్ట్‌మెంట్లో, సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమోరాల ఏర్పాటుకు తగిన కృషి చేస్తామని తెలిపారు.

గంజాయి తాగుతున్న యువకులు అరెస్ట్

మల్కాజిగిరి, మే 22: గంజాయి తాగుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గణేష్ కథనం ప్రకారం.. వాణీనగర్‌లో బుధవారం రాత్రి యువకులు గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది.వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బరిగేలాశివ కుమార్, మక్కనోళ్ల పవన్ కుమార్, కన్నా సాయి హేమంత్, కాదమని నందులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 గ్రాముల గంజాయి,సెల్‌ఫోన్లను స్వాధీనం తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రయించిన పరుశురాం పరారీలో ఉన్నాడు.

సామాజిక ఉద్యమాలకు తొలి గురువు

భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమంలో అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు

ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, నాయకులు

సికింద్రాబాద్, మే 22: సామాజిక ఉద్యమాలకు తొలి గురువు భాగ్యరెడ్డి వర్మ అని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు అన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి సందర్భంగా అంసా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నామ సైదులు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో ఆత్మగౌరవ పోరుకు తొలి పొద్దుగా నిలిచింది భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. బాగయ్య యుక్త వయస్సులో ఆర్యసమాజంలో పని చేశాడని, ఆర్య సమాజ నిర్వాహకుడు కిషన్‌రావు ఆయన సేవలను గుర్తించి వర్మ బిరుదుని ఇచ్చారని గుర్తుచేశారు. బుసలు కొడుతున్న కుల వ్యవస్థను విద్య ద్వారానే బద్దలు కొట్టాలనే సంకల్పంతో అంటరాని కులాల బాలికల కోసం 26 పాఠశాలలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. అంటరాని తనాన్ని రూపుమాపేందుకు ప్రజలను చైతన్యం చేసిన కార్యశీలి అని కొనియాడారు. వందేండ్లకు పూర్వమే ప్రజల్లో చైతన్యాన్ని నింపిన భాగ్యరెడ్డి వర్మ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని నామ సైదులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు వలిగొండ నర్సింహా, కరుణ్, కాశీనాథ్, కృష్ణ, రమేష్, సతీష్, నవీన్, సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో

భాగ్యరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్, రెవెన్యూ ఉద్యోగులు

అడ్డగుట్ట: మారేడ్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజునాయక్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, స్పెషల్ ఆర్ఐ కృతిక, ఆర్ఐ సర్వేష్, వంశీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతుల కల్పనకు కృషి

సమావేశంలో పాల్గొన్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, మే 22: శ్మశానవాటికలో వసతుల కల్పనకు కమిటీ సభ్యులందరూ కలిసి కట్టుగా పనిచేయాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సూచించారు. గురువారం నార్త్ లాలాగూడలోని సత్యహరిశ్చంద్ర శ్మశానవాటిక నూతన కమిటీ అధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశానవాటికలో వసతుల కల్పనకు అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, అమర్ బాన్సోడె, కమిటీ అధ్యక్షుడు తాండ్ర రమేష్, లక్ష్మినారాయణ, మహేందర్, దేవానంద్, జగదీష్, హనుమంతు, జానకిరాములు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు కృషి చేయాలి

ఫాగింగ్ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, మే 22: దోమల నియంత్రణకు కృషి చేయాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ అర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ సిబ్బంది కలిసి ఏరియాకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ప్రజలు దోమల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా చెత్త కుప్పలు కుప్పలుగా పెట్టొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. రానున్నది వర్షాకాలం సందర్భంగా దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ యూనస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడలో నేడు జాబ్ మేళా

హిమాయత్‌నగర్, మే 22: నారాయణగూడలోని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెన్‌ప్యాక్ట్, అపోలో ఫార్మసీ, సర్‌టెక్ లాంటి పలు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. నగరంలోని అన్ని కళాశాలలకు చెందిన డిగ్రీ పూర్తయిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వారి బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం. 8099 443921 ను సంప్రదించగలరని కోరారు.

సంస్కరణ ఉద్యమాలకు మూలపురుషుడు రాజా రామ్మోహన్‌రాయ్

సభలో మాట్లాడుతున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, మే 22: సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలకు మూలపురుషుడు రాజారామ్మోహన్‌రాయ్ అని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా గురువారం ప్రముఖ సంఘ సేవకుడు రామ్మోహన్ రాయ్ సంస్కరణ సభ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇనాక్ పాల్గొని రామ్మోహన్ రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రామ్మోహన్ రాయ్ దేశంలో సంస్కరణ ఉద్యమాలకు స్వీకారం చుట్టారని అన్నారు. సతీసహగమనం దురాచారాన్ని రూపుమాపడానికి విశేషంగా కృషి చేశారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవయిత్రి శైలజ మిత్ర, సినీ నిర్మాత తుమ్మల రామ సత్యనారాయణ మూర్తి, పీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, స్థానిక కార్పొరేటర్ పావని, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి భావనతో మంచి నడవడిక ఏర్పడుతుందని, ధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, కార్య నిర్వాహణాధికారి దేవనాథం పర్యవేక్షణలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎం.రాకేష్‌కుమార్, మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి పద్మ, సుధాకర్‌గుప్తా, రవియాదవ్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ఆర్.మోజెస్, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు బుగ్గ లక్ష్మిపతిశర్మ, కందల వెంకటాద్రి, కృష్ణమూర్తి, దీక్షితులు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, మే 22:

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు

బీఆర్ఎస్ నాయకుడడు మోజస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 22: పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపునిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్.మోజస్ తన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యేను కలువగా శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌గుప్తా, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు

బహుమతులు అందుకుంటున్న ప్రతిభ చాటిన విద్యార్థులు

అమీర్‌పేట్ మే 21: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ ఆడిటోరియంలో జరిగిన పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు జరిగాయి. సముద్రపు జీవులు, మానవులు, జంతువులు, పక్షుల జీవితాలపై ప్లాస్టిక్ కాలుష్యపు వినాశకరమైన ప్రభావం ఎంతలా ఉందనే విషయాలను నగర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ శాస్త్రీయ నృత్యాల ద్వారా చక్కగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్‌తో పాటు పీసీబీ అధికారులు విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఉద్యోగం కోసం వచ్చి.. గంజాయి విక్రయం

యువకుడితో పాటు ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

బంజారాహిల్స్, మే 22: ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు గంజాయి విక్రేతగా మారి పోలీసులకు పట్టుబడ్డాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి ప్రాంతానికి చెందిన కే.రాహుల్ (27) బీటెక్ పూర్తిచేసి ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. కొండాపూర్‌లో నివాసం ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో ఇటీవల ఎల్బీనగర్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనవద్ద గంజాయి ఉందని, దాన్ని అవసరం ఉన్నవారికి విక్రయించి డబ్బులు సంపాదించవచ్చని మహేష్ చెప్పడంతో కొంతకాలంగా రాహుల్ గంజాయి విక్రేతగా మారాడు. ఈ క్రమంలో ఫిలింనగర్ సమీపంలోని కొత్త చెరువును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి అమ్మేందుకు వచ్చిన రాహుల్ మీద ఫిలింనగర్ పోలీసులు నిఘా పెట్టారు. స్వయంభూ, కుందన్ అనే వ్యక్తులకు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడు రాహుల్ వద్ద నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తెలంగాణ రత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, మే 22: తెలంగాణ రత్న పురస్కారం 2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి సాహిత్య (సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ) అధ్యక్షుడు లయన్ డా.ఇఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని జూన్ 1న అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాలో కవులు, రచయితలు, సంగీత, నృత్య, రంగస్థల, కళాకారుల, ఉపాధ్యాయుల, విద్యావంతుల, వైద్యుల, సమాజ సేవకుల, ఆధ్యాత్మిక, క్రీడ, యోగా గురువులు, కార్మిక, కర్షక, క్రీడాకారుల ప్రతిభను, సేవలను గుర్తించి వారికి తెలంగాణ రత్న, తెలంగాణ కీర్తి, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డులను ఇచ్చి ఘనంగా సన్మానిస్తున్నట్టు తెలిపారు. పురస్కారం ఎంపిక కోసం సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 25లోపు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి, గోకుల్‌నగర్, వెంకటాపురంలో అందజేయాలి. మరిన్ని వివరాలకు 96523 47207ను సంప్రదించగలరు.

అక్రమ కట్టడాల కూల్చివేత

సికింద్రాబాద్, మే 22: సీతాఫల్‌మండిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ అధికారులు గురువారం కూల్చివేశారు. సీతాఫల్‌మండిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు అందడంతో కూల్చివేసినట్లు అధికారులు చెప్పారు. సీతాఫల్‌మండిలోని బిట్టు బార్ పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న 2 అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బాల శ్రీనివాసరావు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నార్త్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత

విద్యార్థులకు ప్రోత్సాహకంగా సైకిళ్లను అందజేస్తున్న నిర్వాహకులు

మారేడ్‌పల్లి, మే 22: హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ 60 ఏళ్ల సేవను పురస్కరించుకొని డైమండ్ జూబ్లీ ఉత్సవాలు బాలంరాయిలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మనోజ్ షా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ సామాజిక అభివృద్ధిలో చేసిన కృషి అభినందనీయమని అన్నారు. అదేవిధంగా విద్య, వైద్య రంగాల్లో లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంగా, బాలికల విద్యకు ప్రోత్సాహకంగా 60 మంది మెరిటోరియస్, ఆర్థికంగా వెనకబడిన బాలికలకు సైకిళ్లను అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్లు బాబురావు, ఆర్.సునీల్ కుమార్, నరేందర్‌రెడ్డి, హెచ్.రాజిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల, హరిదర్శన్ క్లబ్ ప్రెసిడెంట్ నవీన్ మాజేటి, సెక్రటరీ సునీల్ తాటిపల్లి, ట్రెజరర్ లయన్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో మారణహోమం

కేంద్ర వైఖరిని ఖండించాలి: బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

హిమాయత్‌నగర్, మే 22: 'ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న మారణ హోమాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు గురువారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, నారాయణపూర్ జిల్లాలోని అబూజ్ మాడ్ అడవులలో సాయుధ పోలీస్ దళాలు ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధా న కార్యదర్శి నంబాల కేశవరావు తో సహా 27 మందిని అత్యంత క్రూరం గా కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కేశవరావు పని చేశాడన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ ప్రకటించినా కేంద్రం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంతే కాకుండా అనేక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు కేంద్ర ప్రభుత్వంకు ఆపరేషన్ కగార్ ఆపి శాంతి చర్చలు జర పాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి సాయుధ మిలిటరీ దళాలను వెనక్కి పంపించాలన్నారు. ఏ సమస్యకైనా పరిష్కార మార్గం చర్చలేనన్న విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. ఈ ఘటనను సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

'గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు'

వ్యవసాయ యూనివర్సిటీ మే 22: ది రిపబ్లిక్ ఆఫ్ మల్టీపుల్– నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జూన్ 2 వరకు రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ జనరల్ రవీంద్ర కుమార్ గురువారం తెలిపారు. ఇంటర్నల్ ఆడిట్‌పై జరిగే ఈ అంతర్జాతీయ శిక్షణకు దేశంలోని గ్రామీణ ప్రాంతాల జీవన జీవనోపాధి పెంపు తదితర అంశాల పైన సుదీర్ఘ చర్చ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులకు శిక్షణ నిర్వహించారు. అధికారుల శిక్షణ పూర్తి అయిన అనంతరం హైదరాబాద్ నగరంలోని పలు చారిత్రక ప్రాంతాలైన గోల్కొండ, ట్యాంక్ బండ్, చార్మినార్, రామోజీ ఫిలింసిటీ తదితర స్థలాల సందర్శన ఉంటుందని ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ ఐఏఎస్ రవీంద్ర కుమార్ తెలిపారు.

దురుసు ప్రవర్తన.. రెండు రోజుల జైలు

బొల్లారం, మే 22: విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు హెచ్చరించారు. ఈ నెల 20న సాయంత్రం 4 గంటల సమయంలో తిరుమలగిరి ట్రాఫిక్ కానిస్టేబుల్ అల్వాల్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తుండగా మచ్చ బొల్లారం ప్రాంతానికి చెందిన పిండిజల సుదర్శన్ (42) ద్విచక్ర వాహనం పై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ రాంగ్ రూట్‌లో సిగ్నల్ జంప్ చేసి వెళుతున్నాడు. అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా బూతులు తిడుతూ వేగంగా వెళ్లిపోయారు. లోతుకుంట జంక్షన్ వద్ద డ్యూటీలో ఉన్న మరో కానిస్టేబుల్ ఆపగా ఇష్టం వచ్చినట్లు దూషించాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగాడని రుజువైంది. అనంతరం బొల్లారం పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలతో పాటు చట్టాలను గౌరవించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మృతి

ఖైరతాబాద్, మే 22 : అనారోగ్యంతో అపస్మారక స్థితిలో పడిపోయిన ఓ వ్యక్తి ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నది. రోటరీ సర్కి ల్ వద్ద యాచక వృత్తి చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 21న మృతిచెందాడు. పోలీసుల విచారణలో హుస్సేనీ ఆలం దూద్‌బౌలికి చెందిన మహ్మద్ జమీల్ (60)గా గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యప్రవర్తన.. వ్యక్తి అరెస్టు

ఖైరతాబాద్, మే 22 : ఓ వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... ఖైరతాబాద్‌లోని లేఖా అపార్ట్‌మెంట్స్ వద్ద ఓ వివాహిత తన భర్త కోసం వేచి చూస్తుండగా, ఆమెపై కన్నేసిన షేక్ అబ్దుల్లా (22) అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడుతూ వేధించాడు. కాగా బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా అబ్దుల్లాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.